# లో వెలుగు

ముందు అలలు అలలుగా సముద్రం.

మనసులో అక్షరం అక్షరం ఆలోచింపజేస్తూ అన్నయ్య ఉత్తరం అన్నయ్య మళ్లీ తిరిగి వస్తున్నాడంటే ఆనందమే - మరి.... ఆ రాక వెనుక ఆవేదన లేకపోతే అంతే చాలు -

"ఇంటిని బాగు చేయించుకోవాలి. చుట్టూ ప్రహరీ కట్టి పూల మొక్కలూ పాదులూ వేసుకోవాలి. లేకుంటే ముందుతరం వారికి నా వూరూ, నా ఇల్లూ, నా వాళ్ళూ అనుకోవడానికేముంటుంది? వాతావరణ కాలుష్యంలో మ్రగ్గిపోతున్న పట్టణాల నుండి విడువడి నాలుగు రోజులైనా స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడానికి అంతకు మించి మరో దారి కనిపించటం లేదు"

అన్నయ్య అభిప్రాయం అదే అయితే బాగానే వుంది. నిజంగా ఆనందించ-వలసిందే - కాని అదే ఉత్తరంలో మరో ధ్వని-

"ఈతరం వారికి బరువు బాధ్యతలులేని స్వేచ్ఛ కావాలి - మంచిగా పరోపకారంగా జీవించడంలో వుండే మానసిక తృప్తి వారికి తెలియదు - ఈ యాంత్రిక జీవితాలలో డబ్బుకుండే విలువ అభిమానాలకు లేకుండా పోతోంది. జీవితపు సమస్యలూ, వ్యక్తి విలువలూ యీ తరం వారి దృష్టిలో తుప్పు పట్టిన పనికిరాని పాత సామాన్లు...."

ఆర్నెల్ల క్రితం ఆ యింటి పరిస్థితి చూసి వుండకపోతే అన్నయ్య మాటల్లోని ఆవేదన నాకు కనిపించి వుండేది కాదేమో!

నా కళ్ళ ముందు లీలగా అన్నయ్య కదిలేడు - ఆ ప్రక్కనే వదిన. వారి మధ్య గారాలు ప్రభాకరం.

యువతరానికి ప్రతినిధి అయిన ప్రభాకరంలోని మార్పు అభిలషించదగినదేనా? తల్లిదండ్రుల సుగుణాల్ని పుణికి పుచ్చుకు పుట్టాడనుకున్న ప్రభాకరం.... ప్రేమాభిమానాలే తప్ప మరొకటి తెలియకుండా పెరిగిన ప్రభాకరం.. ఎక్కడుంది లోపం?

విషయం గ్రహింపు కొచ్చిన దగ్గర్నుంచీ నాలో ఆవేదన.

నాన్నే వుండి వుంటే ఆయన కూడా అంత అనురాగంగా ప్రేమగా పెంచి వుండేవారు కారేమో అనుకునేలా నన్ను పెంచి ప్రయోజకుడ్ని చేసిన అన్నయ్య- అమ్మ తర్వాత అమ్మయిన వదిన -

బీచిలో జనం పల్చబడుతున్నారు.

ఆకాశం అంచుల నుంచి జారుతున్న చీకటి!

గంభీర ముద్రలో సముద్రం -

ప్రభాకరాన్ని తీర్చిదిద్దడంలో అన్నయ్య పడ్డ శ్రమ నాకు తెలియంది కాదు. పెద్ద చదువులు చదవాలనుకున్న ఒక్కగానొక్క కొడుకూ అత్తెసరు మార్కులతో కాలేజీ చదువుకు స్వస్తి చెబితే, తను నమ్మిన ఆశయాల్ని పక్కకు పెట్టి మూడేళ్ళ ముందుగా 'పనికి రాని వాడిగా' పదవి నుంచి తప్పుకుని ప్రభాకరానికి ఓ ఉద్యోగార్హతను సంపాదించి పెట్టేడు. కల్పతరువు లాంటి ఆ సంస్థలో ప్రభాకరానికి ఉద్యోగమొస్తే దేశానికి ప్రధానమంత్రి అయినంత సంబరపడిపోయాడు. చిన్న ఉద్యోగస్తుడయినా ప్రభాకరం తనలా మధ్య తరగతి బ్రతుకు బతక్కూడదని ఉద్యోగస్తురాలైన పిల్లను ఏరి కోరి కోడలిగా చేసుకున్నాడు. కొడుకు పంచనే చివరి రోజులు గడిచిపోతే చాలునని పుట్టి పెరిగిన వూర్ని విడిచి పెట్టి వెళ్ళేడు.

ఆర్నెల క్రితం ఆఫీసు పని మీద ఢిల్లీ వెళ్ళి వస్తూ దారిలో మనసు పీకి ఆగినప్పటి సంఘటనలు నా కళ్ళ ముందు కదులాడేయి.

అప్పటికి అన్నయ్యా వాళ్ళని చూసి రెండేళ్లయింది. అక్కడున్న ఒక్కరోజులో పరిస్థితి అర్థమైపోయింది. ప్రభాకరంలో ఎంతో మార్పు కనిపించింది. అన్నయ్య పరిస్థితి చూస్తే మనసులోంచి ఆవేదన పొర్లుకొచ్చింది.

ఉదయం కాస్తంత తోటపని, పుస్తక పఠనం, సాయంకాలం కాస్సేపు నడక, రాత్రి మిత భోజనం, గీతా పారాయణం - ఎన్నో ఏళ్ళుగా మారని అన్నయ్య దినచర్యలోనూ, అలవాట్లలోనూ మార్పు కొట్టొచ్చినట్టు కనిపించింది.

ఉన్న నాలుగు గదుల్లోనూ ఒకటి- టి.వి., ఫ్రిజ్ మొదలైన స్టేటస్ సింబల్స్‌తో నిండిపోయిన డ్రాయింగ్ రూం. ఒకటి ప్రభాకరం పడక గది- వంటగది పోను మిగిలిన చిన్న గది సామాన్లతో నిండి ఉంటుంది. అందులోనే అన్నయ్య మంచం. గాలీ వెలుతురూ సరిగా సోకని ఆ ఇరుకు గదిలో అన్నయ్యను చూస్తే బాధనపించింది. వదిన సంగతి సరే సరి. ఆ ఉన్న పట్టె మంచాన్ని నేసి ఎన్నాళ్ళయిందో! అన్నయ్య మంచానికి కాళ్ళ వైపునే చాప మీద ఆమె పక్క

'ఆయన గారి సింహాసనం' అంటూ ఎప్పుడూ వదిన ఎగతాళి చేసే అన్నయ్య కూర్చునే ఈజీచైరు అటక మీద చిరిగిన గుడ్డతో పడుంది.

ముందు గది అల్మరాలో సరస్వతీ విగ్రహం పక్క వుండాల్సిన సుందరకాండ, గీతామకరందము, రామాయణ భారత భాగవతాలు అన్నయ్య ఇరుకు గదిలోనే ఓ చెక్క పెట్టెలో అజ్ఞాతమైపోయాయి.

"రోజులు మారిపోతున్నాయి. గదులతో పాటు మనుషులు మనసులూ ఇరుకైపోతున్నాయి."

- ఏదో సందర్భంలో అన్నయ్య అన్న మాటలకు అర్థం ఈ రోజు తెలిసింది.

"బావున్నావా బాబాయ్" అంటూ రాగానే పలకరించిన ప్రభాకరం మళ్ళీ రాత్రి వరకూ పత్తా లేదు.

రాత్రి భోజనాలు అంతా కలిసే. వదిన మా చిన్నప్పటి సంగతులు ముచ్చటించింది. తర్వాత నేను మా కరుణ ఇంగ్లీషు చదువు, తెలుగు భాషా జ్ఞానం గురించి చెబుతూంటే అన్నయ్య నవ్వు.

"భాష ఏదైతేనేం? జ్ఞానం. దానితో పాటు సంస్కారం అబ్బాలి" అంటూ ఓ ముక్క మాట్లాడేడు.

భోజనాలయ్యేక బాల్కనీలో వున్న కుర్చీలో కూర్చొని ఆ వూరి రాత్రి అందాన్ని చూస్తుంటే ప్రభాకరం వచ్చి, "మంచి ఇంగ్లీషు మూవీ వుంది బాబాయ్. ఈ రోజే ఆఖరి రోజు. నువ్వూ రాకూడదూ" అన్నాడు.

చిన్నప్పుడు లెక్కలు రాక నా చేత చెంప దెబ్బలు తిన్న ప్రభాకరం ఈ రోజు భార్యతో సినిమాకి వెళ్తూ నన్ను పిలిచే ధోరణికి మనసులోనే నవ్వుకున్నాను.

"బడలికగా వుందిరా. మీరు వెళ్ళండి" అని తప్పించుకున్నాను.

మరో పది నిముషాల్లో స్కూటర్ మీద వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. డ్రాయింగ్ రూంలో సోఫా సర్ది నాకు పక్క ఏర్పాటు చేసింది వదిన. టీవీలో ప్రోగ్రాం చూస్తూ కూర్చున్నాను. ప్రయాణ బడలిక వున్నా ఆలోచనల వల్ల కాబోలు నిద్ర రాలేదు.

అన్నయ్య గదిలో లైటు ఆరిపోయింది. టీవీ ఆఫ్ చేసి బాల్కనీలోకి వెళ్ళి నిల్చున్నాను. కాస్సేపటికి అన్నయ్య దగ్గు వినిపించింది, ఖళ్ళు ఖళ్ళున! టీవీ చూస్తూ అంతగా గమనించలేదు గాని ఇప్పుడు వింటూంటే అన్నయ్య ఆ దగ్గు బాధతో మెలికలు తిరిగిపోతున్నట్టనిపించింది.

బయట వూరంతా ప్రశాంతంగా ఉంది. వెన్నెల మసగ మసగ్గా వుంది – నేను తలుపు తీసిన చప్పుడు విన్నది కాబోలు – వదిన లేచి వచ్చి "ఇంకా నిద్రపోలేదూ" అంది గుమ్మం దగ్గరే నిల్చుని.

"లేదు వదినా. స్థలం మార్పు కదా. నిద్ర రావటం లేదు" అని,

"అన్నయ్యకాదగ్గేమిటీ? డాక్టర్‌కి చూపించేరా?" అడిగాను.

"అడక్కు. మూడునెలలైంది అదే వరస. వచ్చే పెన్షన్ డబ్బులు మందులకే చాలటం లేదు" అంది.

"అదేం? ప్రభాకరం కంపెనీ వారు మందుల గురించి ఖర్చు చేసిన సొమ్ము వాపసు యిస్తారుగా" అన్నాను.

దానికి వదిన చెప్పిన సమాధానం విని నా నోట మాట రాలేదు.

తనపై ఆధారపడిన తల్లిదండ్రులను విస్మరించి భార్య జీతం ఎక్కువ కనుక వారి కంపెనీ ఆమెకు కల్పించే సదుపాయాల కోసం భార్యకే 'డిపెండెంట్' అయ్యాడు ప్రభాకరం.

అన్నయ్య పెంపకంలో ఎక్కడుందో లోపం అర్థం కాలేదు.

ఉదయాన్నే నా ప్రయాణం గురించి చెబుతూ ప్రభాకరంతో అన్నయ్య ఆరోగ్యం విషయం కదలేశాను.

నా మాటలకు ప్రభాకరం ముఖంలో రంగులు మారి ఆ వెంటనే సర్దుకున్నాయి.

"ఏం చెప్పను బాబాయ్. ఆయన ఆయుర్వేదాన్ని తప్ప మరో దాన్ని నమ్మరు - ఖరీదైన మందులు వద్దంటారు" అంటూ మాట మార్చేశాడు.

ప్రభాకరం, అతని భార్య తొమ్మిదింటికి స్కూటర్ మీద ఉద్యోగాలకి వెళ్ళేక భోజనం చేసి బయల్దేరాను.

అన్నయ్యలో ఎప్పుడూ అదే ముభావం, అదే హుందా.

"ఉత్తరాలు రాస్తూండు - పిల్లల చదువులు జాగ్రత్త!" అన్నాడు.

గుమ్మం దాకా వచ్చి సాగనంపిన వదిన ముఖంలో దిగులు, అలసట కనిపించేయి.

'మీ రిద్దరూ నా దగ్గరకు వచ్చెయ్యరాదు వదినా? కంటికి రెప్పల్లా చూసుకుంటాను. ఆ విధంగానైనా కాస్త రుణవిముక్తిడినౌతాను' - అనాలనుకున్న మాటలు గొంతులోనే చిక్కుపడిపోయాయి. కొడుకు నించి విడదీయడం భావ్యం కాదనిపించి వచ్చేశాను.

అప్పటి ఆ యింటి పరిస్థితులు కళ్ళకు కట్టినట్టే వున్నాయి. ఇన్నాళ్ళకి ఇప్పుడీ ఉత్తరం. ఉత్తరంలోని ప్రతి వాక్యం నా కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది.

గాలి రివ్వున వీచింది.

కాళ్ళకి పట్టేసిన ఇసుక రేణువుల్ని దులుపుకు లేచాను.

దూరంగా సముద్రంలో ఆగిన పడవల్లోంచి ఆశాకిరణాల్లా దీపాల చుక్కలు!

ఇసుక తిన్నె దాటి, రోడ్డెక్కి బస్టాపు వైపు నడక సాగించాను.

"మీరు ప్రకాశంగారు కదూ" - ఎవరో పలకరించినట్టయి అటు తిరిగాను.

ఇరవై నాలుగేళ్ళ యువకుడు! ఎత్తుగా సౌమ్యంగా వున్నాడు. నా వంకే చూస్తూ "నన్ను పోల్చారా" అంటూ నవ్వేడు.

నా లోచనలను వెనక్కునెట్టి దీపాల వెలుగులో అతని వంక చూశాను పరిశీలనగా.

అతని నవ్వులో దొరక్కుండా జారిపోతున్న ఓ రూపం కదిలింది. నా కాట్టే శ్రమ ఇవ్వకుండానే -

"సంతోష్ని" అన్నాడు తనే.

సంతోష్! రూపాన్ని చూసి పోల్చలేక పోయాను గాని ఆ పేరు వింటే చటుక్కున జ్ఞాపకమొచ్చింది.

"ఏవిటీ! జగదాంబగారి అబ్బాయి సంతోష్వా?"

నా ఆశ్చర్యం వెనుక కొద్దిపాటి ఆనందం. ఈ జీవిత నాటక రంగంలో నేను చూసిన పాత్రలలో సంతోష్ పాత్ర మరపురానిది. కాస్త విలక్షణమైనదీను. ఎలా మరిచిపోగలను?

బాల్య యౌవన కౌమార వార్ధక్య దశలన్నీ సంతోషంగా ఒకే విధంగా జరిగేది ఏ కొద్దిమందికో! బాల్యంలోని ముద్దు ముచ్చట్లని మిగలిన దశల్లో తీపి జ్ఞాపకాలుగా మాత్రమే భద్రపరుచుకునేవారిని తెలుసు.

బాల్యం అతి పేదగా గడిచినా అనుభవాలు నేర్పిన పాఠంతో పరిపక్వత చెంది, పంకంలోంచి మొలకెత్తి వికసించిన పుష్పంలా యౌవన కౌమార దశల్లో పరిమళించిన వారినీ తెలుసు. అయితే సంతోష్ జీవితం ఈ రెంటిలో ఏ ఒక్కదాన్నీ పోలదేమో!

"ఏం చేస్తున్నావిప్పుడూ" అడిగాను చనువుగా.

"నేవల్ బేస్‌లో టైపిస్టుగా చేస్తున్నాను" చెప్పేడు.

"మీ అమ్మ, నాన్నగారూ....?"

"నాన్నగారు రిటైరపోయారు. ప్రస్తుతం అంతా యిక్కడే వుంటున్నాం"

అతని మాటల్లో ఒకింత పెద్ద తరహాగా గోచరించింది.

"మరి... నీకు పెళ్ళయిందా?" అడిగాను.

ఆ ప్రశ్నకు నవ్వి, "ఏడాది క్రితమే అయింది. ఎవరికీ చెప్పకుండా చేసుకోవలసి వచ్చింది" అన్నాడు.

"అదేం?"

"అలా జరిగిపోయింది. మొదట అందరూ అనుకున్న సంబంధమే. కానీ డబ్బు విషయంలో మా అమ్మ ఎవరు చెప్పినా వినదు కదా! మగ పిల్లాడిని పెంచి పెద్ద చేయడం కష్టం తీసుకోవడానికే అనుకుంటుంది. ఐదు వేల రూపాయల దగ్గర తేడా వచ్చి సంబంధం వద్దనేశారు. అమ్మ మాటను నాన్నా కాదనలేకపోయారు."

నేనాశ్చర్యంగా చూశానతని వంక.

"అంతవరకూ వెళ్ళిన సంబంధం అలా తప్పిపోవడం నాకెందుకో నచ్చలేదు– పైగా ఆ అమ్మాయి నాకు నచ్చింది. నేను కూడా ఆ అమ్మాయికి మనస్ఫూర్తిగానే నచ్చినట్టు తెలుసుకున్నాక ఒక నిర్ణయానికొచ్చాను. పెద్దల ప్రమేయం లేకుండానే రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం" అన్నాడు.

పెళ్ళి విషయంలో అతను ప్రదర్శించిన ధైర్యం కంటే తీసుకున్న నిర్ణయమే గొప్పగా అనిపించింది నాకు.

"రెండు నెలలు అమ్మ మాతో మాట్లాడలేదు. తర్వాత వందన మంచితనమే మళ్ళీ మమ్మల్ని కలిపింది. ఇప్పుడు మేమిద్దరం వాళ్ళిద్దరికీ రెండు కళ్ళు" అన్నాడు.

ఎంతో ఆనందమనిపించింది అతని మాటలు వింటే –

"అయితే కోడలు దిద్దిన కాపురమన్నమాట!" అన్నాను నవ్వుతూ.

అతనూ నవ్వేసి, "ఇంతవరకూ వచ్చారు – ఓ మారు మా యింటికి రాకూడదూ – దగ్గరే" అంటూ ఆహ్వానించాడు.

కాదనడానికి నాకు కారణం కనిపించలేదు.

అడుగులు ముందుకు పడుతూంటే ఆలోచనలు గతంలోకి మళ్ళేయి.

చాలా ఏళ్ళ క్రితం మేం విజయనగరంలో వుండే రోజుల్లో నాలుగిళ్ళలోగిలి లాంటి ఆ యింట్లో ఒక వాటాలో మేముంటే మరో వాటాలో సంతోష్ వాళ్ళూ వుండేవారు. సంతోష్ తండ్రి ఆర్మీలో చేసేవాడు – ఏ ఆర్నెల్లకో ఓ మారొచ్చి వారం రోజులుండి

వెళ్ళేవాడు. మేడ మీదుండే ఇంటిగలాయన దేవీ ఉపాసకుడు. మూరెడు గడ్డం, మెడలో రుద్రాక్షలు - కాషాయరంగు సిల్కుపంచ - అంతా ఆయనను స్వామీజీ అనేవారు. ఆయన భార్య కనకమ్మ నిజంగా కనకమ్మే. బంగారు నగలతో, బంగారు ఛాయలో ఉండేది.

ప్రతి ఏడాదీ దేవీ నవరాత్రులు ఘనంగా జరిపించేవారు స్వామీజీ - ఆ తొమ్మిది రాత్రులూ ఆ నాలుగిళ్ళ లోగిలంతా ఒక్కటైపోయేది. దీపాల అలంకరణలూ, పూజలూ, భక్తులు రావటాలూ, తీర్థప్రసాదాలు కోలాహలంగా ఉండేది. ఆ తొమ్మిది రోజులూ స్వామీజీ ఆయన భార్య దైవాంశ సోకినట్లు వుండేవారు! ఆ ఉత్సవాలకు వచ్చే భక్తులంతా ఘనంగా కానుకలు అర్పించుకునేవారు.

మిగిలిన రోజుల్లో స్వామీజీ నిత్యపూజలు చేసేవారు. జ్యోతిషం చెప్పేవారు. తప్పిపోయిన మనుషుల, పశువుల ఆచూకీ తెలిపేవారు. కొన్ని కొన్ని రోగాల్ని జపాలూ, హోమాలూ చేయడం ద్వారా నయం చేయొచ్చనని చెప్పి భక్తుల ఖర్చులతో చేసేవారు. కానీ అటువంటి రోగాలు నయమైన దాఖలాలు నా కెక్కడా కనిపించలేదు.

సంతోష్ తల్లి జగదాంబగారికి స్వామీజీ కుటుంబంపై గురి. ఉదయాన్నే ఆమె స్నానం చేసి వారి ఇంటికి వెళ్ళేది- దేవుడి గది శుభ్రపరిచేది. నిత్యపూజకు పూలూ, సామాగ్రీ సిద్ధం చేసేది.

స్వామీజీని దైవ స్వరూపులుగా భావించి వారి సేవ చేయడమే మహద్భాగ్యంగా భావించి వారింట ప్రతి పనీ చేసేది.

సంతోష్ కప్పుడు ఏడేళ్ళుంటాయేమో. తన తల్లి వారింట పనిచేయడం అతనికి నచ్చేది కాదు. ఆ విషయం బాహాటంగానే చెప్పేవాడు. తల్లి సంరక్షణ కరువై అతడు అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. తర్వాత తల్లి చేత దెబ్బలు తినేవాడు. కొడుకు తన చేయి దాటి పోతున్నాడనిపించినపుడు జగదాంబగారు సంతోష్‌ని మందలించే బాధ్యతను స్వామీజీకి అప్పగించేవారు. శాంతంగా భక్తులనాశీర్వదించే స్వామీజీ కూడా బెత్తంతో సంతోష్‌ని మందలించడం నా కాశ్చర్యాన్ని కలిగించేది. కనకమ్మగారి దండన కూడా అంతకుమించే వుండేది.

ఓ మారు సంతోష్ చెప్పకుండా సినిమాకి వెళ్లేడన్న కోపంతో కనకమ్మగారు చేతిలోని గరిటతో అతని నెత్తిపై కొట్టేరు - అంతే! రక్తం ధారకట్టింది. దెబ్బను కూడా లక్ష్యపెట్టకుండా పరుగెత్తితే, దారి పొడవునా రక్తపు చుక్కలే.

క్రమంగా నాకు స్వామీజీపై గౌరవం సన్నగిల్లి అది సంతోష్ పట్ల జాలిగా మారిపోసాగింది.

తండ్రే దగ్గర వుంటే సంతోష్ యిలా పెరిగేవాడు కాదేమో అనిపించేది.

అటువంటి సంతోష్ ఈ రోజిలా కనిపిస్తే... ఆశ్చర్యం కాక?

స్వామీజీ కుటుంబం గురించి అడక్కుండా వుండలేకపోయాను. చాలా టూకీగా ఏ భావమూ కనిపించని తీరులో చెబుతుంటే నా ఆశ్చర్యం ద్విగుణీకృతమైంది.

ఉబ్బు కామెర్లతో కనకమ్మగారు పోతే మరో ఏడాదికే రైలు ప్రమాదంలో స్వామీజీ కూడా పోయారట.

"దైవ స్వరూపులకు చావేమిటి? మా యిచ్చ ప్రకారమే శతాధిక వయసులో శివసాయుజ్యం పొందుతాం" అని తమ జీవితాలకు తామే జోస్యం చెప్పుకున్న స్వామీజీ నా కళ్ళ ముందు నిలిచారోక్షణం.

"వీడుట్టి దౌర్భాగ్యుడు- భవిష్యత్తు శూన్యమై అనుభవిస్తాడు" అని దైవ వాక్కులను తన నోట పలికించే స్వామీజీ ఒకానొక సందర్భంలో సంతోష్‌ను గురించి అన్న మాటలు గుర్తొచ్చాయి.

అలలు అలలుగా సముద్రం విడిపోతున్నా హోరు మాత్రం వింతగా భయంకరంగా వినిపిస్తూనే ఉంది.

ఊలు దారాల్లా పెరిగిన పేర్లు తెలియని గడ్డిమొక్కలను తొక్కుకుంటూ అడ్డదారిన నడుస్తున్నాం.

"ఇదే మా యిల్లు" అంటూ ఆగేడు సంతోష్. చిన్నగా తలుపు చప్పుడు చేశాడు. తలుపు తెరిచిన ఆమె వంక చూశాను. ఇరవై ఏళ్ళుంటాయేమో. కొత్త వ్యక్తిని చూసిన సిగ్గుతో మెరుపుతీగలా చటుక్కున లోపలికి వెళ్ళిపోయింది.

నన్ను కూర్చోమని కుర్చీ చూపించి లోపలికి వెళ్ళిన వాడల్లా వెంటనే తిరిగొచ్చి "అమ్మా నాన్నా పురాణానికి వెళ్ళేరట" అన్నాడు.

రెండు గాజు గ్లాసులతో నిమ్మరం తీసుకొచ్చిందా అమ్మాయి. జాజి లతలా సుకుమారంగా ఉంది.

"ప్రకాశంగారనీ... నా చిన్నప్పుడు మేముండే యింట్లోనే వుండేవారు. కాలేజీలో చదువుతూనే కథలు అవీ రాస్తుండేవారు" అంటూ నన్ను పరిచయం చేశాడు వినయంగా. నమస్కరించిందా అమ్మాయి.

"మా ఆవిడ. పేరు వందన" అన్నాడు.

ఆమె కళ్ళలో వింత కాంతీ; ముఖంలో మూర్తీభవించిన సంస్కారమూ కనిపించాయి. నేను గొప్పగా చెప్పుకుని మురిసిపోయే మా అమ్మాయి కరుణ కళ్ళలో కూడా ఆ కాంతి నా కెప్పుడూ కనిపించలేదు.

"మీరు రావడం మా యింటికి ఓ కొత్త వెలుగు వచ్చినంత ఆనందంగా వుంది" అంది చిన్నగా నవ్వుతూ. వెండి మువ్వలు మ్రోగినట్లు సొంపుగా ఆ మాటలు!

"ఆ మాటలకు ఆశ్చర్యపోకండి. ఇప్పుడిప్పుడే కవితలూ అవీ రాస్తోంది" అన్నాడు సంతోష్ నవ్వుతూ.

"అదేం కాదు" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

వందన రాసిన కవితల డైరీని తెచ్చి చూపించాడు సంతోష్. స్త్రీ, వెన్నెల, ప్రకృతి, వసంతం, మానవత్వం ఇటువంటివే ఆమె తీసుకున్న కవితా వస్తువులు. మనోజ్ఞ భావ కల్పనలతో మనోహరంగా అనిపించాయి.

"చిన్నప్పట్నించీ భారత భాగవతాలంటే యిష్టం. పెళ్లయ్యే వరకూ రాత్రులు రామాయణాది కావ్యాలను చదివి తల్లికి వినిపించేదట. ఇప్పుడేమో అత్తగారికి" సంతోష్ చెబుతూంటే ముచ్చటేసింది.

"నూతిలోని కప్పని. నాకు తెలిసిన ప్రపంచం చిన్నది" అంది వందన లోపలి గది గుమ్మంలోంచే.

కుర్చీలోంచి లేస్తుంటే జేబులోని వస్తువేదో చేతికి తగిలింది. ఎన్నాళ్ళుగానో కరుణ కోరుకుంటున్న జపాన్ పెన్! టెంత్ క్లాసులో స్కూలు ఫస్టు వచ్చినందుకు ఈ రోజు కొన్నాను బహుమతిగా యివ్వాలని – అన్ని బహుమతుల్లోకి పెన్ను బహుమతి విలువైందన్న ఉద్దేశంతో.

"నిజంగా నీ కవితలు బాగున్నాయమ్మా. సహజత్వాన్ని మరిచిపోయి కృత్రిమత్వం వెంట పరుగెత్తే మా వంటి వారి కోసమైనా నువ్వు మరిన్ని మంచి కవితలు రాసి ప్రచురించాలి. అందుకోసమే యీ చిన్న కానుక" అంటూ జేబులోని పెన్ను తీసి ఆమె కందించాను.

నా అడుగులు ముందుకు పడుతుంటే ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడికో పరుగులెత్తాయి.

తల్లిదండ్రుల ప్రేమకు నోచుకుని ముద్దుగా పెరిగిన ప్రభాకరం; అతని సంపాదనా పరురాలైన భార్య –

బాల్యం ముళ్ళపాన్పుపై నిర్లక్ష్యంగా ఏ సంతోషానికీ నోచుకోని సంతోష్. అతని అనురాగవతి అయిన అర్ధాంగీ –

యువత ఎటుపోతోందన్న నా విచిత్ర ప్రశ్నకు రెండు వైపులా నిలిచినట్లుంది.

యువత నడిచేది కాలాన్ని బట్టా?

పరిస్థితులను బట్టా? పెరకువను బట్టా?

ఇవేవీ కావేమో!

మరి?

నా ఆలోచనల్లో ఎక్కడో ఏదో కదలిక వచ్చింది.

అవును – ఏ తరంలోనైనా మనిషి నడతకు కారణం... అదే!

నా అడుగులు ముందుకు పడుతున్నాయి.

సముద్రపు హోరు వినిపిస్తూనే వుంది.

గంభీరంగా, భయంకరంగా మాత్రం కాదు.

అత్యంత సహజంగా!

*● రచన సచిత్ర మాసపత్రిక – జూన్ 1992*

*●● 'ఆత్మజ్ఞాన్' పేరుతో హిందీలోకి అనువదింపబడి*

*'కహానీకా జమీనీ తహరావ్' కథా సంకలనంలో చేర్చబడింది – జనవరి 2002*